క్లుప్తంగా

బంగారపు నేత్రం బహూకరణ



బంగారపునేత్రం అందజేస్తున్న ఉదయవీరలక్ష్మి

మునగాల : మండల కేంద్రంలోని శ్రీరామలింగేశ్వర హనుమాన్ దేవాలయంలో ఆంజనేయ స్వామి విగ్రహానికి సుమారు రూ.45వేల విలువగల బంగారపు నేత్రాన్ని గ్రామానికి చెందిన పెనుగొండ విశ్వనాథం జ్ఞాపకార్థం కుమార్తె పబ్బిశెట్టి ఉదయలక్ష్మి –ప్రసాద్ దంపతులు సోమవారం ఆలయ కమిటీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు తూముల వీరస్వామి, గంధం అంజయ్య, ఆంజనేయశర్మ, కమిటీ సభ్యులు వెంకటప్పయ్య, సైదారావు పాల్గొన్నారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందన



బహుమతులు గెలుచుకున్న విద్యార్థులు

కోదాడ : వరంగల్‌లో ఇటీవల నిర్వహించిన కరాటే, సూర్యాపేటలో నిర్వహించిన చెస్ పోటీల్లో పట్టణంలోని తేజ టాలెంట్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు పాల్గొని బహుమతులు గెలుచుకున్నారు. సోమవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు అప్పారావు విద్యార్థులను అభినందించి మాట్లాడారు. కరాటే పోటీలో పాఠశాలకు చెందిన తుహనశ్రీ ప్రథమ స్థానంలో నిలవగా చెస్ పోటీలో డి.శామ్యూల్, శర్వస్, బి.కార్తికేయ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించినట్లు ఆయన తెలిపారు. సంతోష్‌కుమార్, సోమనాయక్, రేణుక, రామ్మూర్తి, రాంబాబు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి క్విజ్ పోటీలు

చిలుకూరు : మండల కేంద్రంలోని శ్రీగోపయ్య సమేత లక్ష్మీతిరుపతమ్మ కల్యాణ మహోత్సవం సందర్భంగా సోమవారం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు మండల స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్విజ్ పోటీల ప్రశ్నాపత్రాన్ని ఎంఈఓ గురవయ్య, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు కరుణాకర్‌రెడ్డి, గుజ్జుల నరసింహారెడ్డి.. ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. పోటీల్లో చిలుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రథమ బహుమతి, పాలెఅన్నారం జెడ్పీహెచ్ఎస్ ద్వితీయ బహుమతి, కొండాపురం జెడ్పీ పాఠశాల తృతీయ బహుమతిని దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామపెద్దల పాల్గొన్నారు.

కొనసాగుతున్న ధ్యాన శిక్షణ తరగతులు

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో ధ్యానంపై ప్రత్యేక శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. సోమవారం ధ్యాన శిక్షణ నిపుణుడు మోత్కూరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రతి రోజు కొంత సమయం కేటాయించి ధ్యానం చేస్తే మానసిక ఉల్లాసం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ భవురెడ్డి వెంకటరత్నం, మండవ వెంకటేశ్వరరావు, అనంతుల కృష్ణయ్య, కన్నెబోయిన వెంకటేశ్వర్లు, వందనపు సూరిబాబు, గజ్జి అప్పారావు, దేవరంగుల వీరన్న, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి



సైన్స్‌ఫెయిర్‌లో విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఎంఈఓ వెంకటేశ్వర్లు

మునగాల : విద్యార్థులు విద్యతో పాటు విజ్ఞానాన్ని పెంపొందించుకునే దిశగా పయనించాలని మండల విద్యాధికారి పిడతల వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సోమవారం మునగాల మండల కేంద్రంలోని సాయిగాయత్రి విద్యానిలయంలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన సుమారు 100 ప్రాజెక్టులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ఉషారాణి, ఏట రెబోతు ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేయాలి

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. సోమవారం చింతలపాలెంలో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ మండల నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో జరగబోయే మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికలకు సమాయత్తం కావాలన్నారు. అనంతరం మండల కోఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు మోర్తాల వెంకటరెడ్డి, మాజీ ఎంపీపీ కె.వెంకటరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పి.శ్రీనివాసరావు, నాయకులు పి.సుబ్బా రావు, జి.శివారెడ్డి, పి.శ్రీనివాసరావు, రోశిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వీరబాబు, సత్యం, మధు, తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

బంక్ నిర్మాణం పూర్తయ్యేదెప్పుడో..



మొద్దులచెరువు స్టేజీ వద్ద నిర్మిస్తున్న పెట్రోల్ బంక్

- తాడువాయి పీఏసీఎస్ ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ నిర్మాణం
- పనులు ప్రారంభించి నాలుగేళ్లయినా అసంపూర్తిగానే..
- త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్న ప్రజలు

మునగాల : మండలంలోని జాతీయ రహదారి పక్కన మొద్దులచెరువు స్టేజీ వద్ద తాడువాయి ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన పెట్రోల్ బంక్ నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. రూ.64 లక్షల వ్యయంతో నిర్మించేందుకు సొసైటీ పాలకవర్గం తీర్మానించారు. భూమిని లీజ్‌కు తీసుకుని కాంట్రాక్టర్‌తో ఒప్పందం కుదుర్చుకుని 2021లో పనులు ప్రారంభించారు. రూ.5 లక్షలతో పెట్రోల్ బంక్ నిర్మాణానికి లైసెన్స్ పొందారు. సొసైటీ పాలకవర్గం.. రూ.17 లక్షలను కాంట్రాక్టర్‌కు చెల్లించారు. ఆ మొత్తంలో కాంట్రాక్టర్ రూ.6.80 లక్షల వెచ్చించి బంక్ చుట్టూ ప్రహరీ, రూ.3.80 లక్షలతో మట్టి తోలి చదును చేయించాడు. మరో రూ.ఆరు లక్షలతో పెట్రోల్, డీజిల్ నిల్వ చేసే ట్యాంకులను కొనుగోలు చేశారు. సదరు కాంట్రాక్టర్ సొసైటీ ఇచ్చిన రూ.17లక్షలను కాంట్రాక్టర్ ఖర్చు చేశారు. ఆ తర్వాత కాంట్రాక్టర్ వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో గత రెండేళ్లుగా బంక్ నిర్మాణ పనులు నిలిచిపోయాయి. పెట్రోల్ బంక్ నిర్మాణానికి పీఏసీఎస్ నుంచి మొత్తం రూ.22 లక్షలు ఖర్చు పెట్టారు. పెట్రోల్ బంక్ నిర్మాణం పూర్తిచేయాలన్న కృతనిశ్చయంతో సొసైటీ పాలకవర్గం మరో కాంట్రాక్టర్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు. కానీ బంక్ నిర్మాణ పనులను మరో కాంట్రాక్టర్‌కు ఇచ్చేందుకు జిల్లా సహకార బ్యాంక్ నుంచి అధికారులు అనుమతులు ఇవ్వకపోవడంతోనే పనులు తిరిగి ప్రారంభం కావడం లేదని సొసైటీ పాలకవర్గ సభ్యులు చెబుతున్నారు. జిల్లా అధికార యంత్రాంగం స్పందించి బంక్ నిర్మాణ పనులకు అనుమతులు ఇవ్వాలని, వీలైనంత త్వరగా బంక్ నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఈ ప్రాంత ప్రజలు, రైతులు కోరుతున్నారు.

పనులు మరో కాంట్రాక్టర్‌కు అప్పగిస్తాం



తాడువాయి పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పెట్రోల్ బంక్ నిర్మాణ పనులు మధ్యలోనే ఆగిపోయిన మాట వాస్తవమే. కాంట్రాక్ట్ చేజిక్కించుకున్న వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడడంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఇప్పటివరకు బంక్ నిర్మాణానికి రూ.22 లక్షలు చెల్లించాం. నిధులు సద్వినియోగం అయ్యాయి. త్వరలో మరో కాంట్రాక్టర్‌తో ఒప్పందం కుదుర్చుకొని బంక్ నిర్మాణ పనులు ప్రారంభించి పూర్తిచేస్తాం.

– తొగరు సీతారాములు, తాడువాయి సొసైటీ చైర్మన్

టోల్ రుసుం మినహాయింపు ఇచ్చేవరకు ఉద్యమం



తహసీల్దార్ సైదులుకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

నేరేడుచర్ల : మండలంలోని చిల్లేపల్లి వద్ద కోదాడ–జడ్చర్ల జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన టోల్ గేటు నుంచి 20 కిలో మీటర్ల పరిధిలో గల స్థానిక వాహనదారులకు మినహాయింపు ఇచ్చేవరకు ఉద్యమం ఆపేది లేదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దూళిపాల ధనుంజయనాయుడు అన్నారు. స్థానికుల వాహనాలకు మినహాయింపు ఇవ్వాలని సోమవారం నేరేడుచర్ల తహసీల్దార్ సురిగి సైదులుకు సీపీఐ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సమస్యను పరిష్కరించకుంటే ఈ నెల 15వ తేదీ నుంచి సీపీఐ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపడతామన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో సీపీఐ మండల కార్యదర్శి యల్లబోయిన సింహాద్రి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మి, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు ఉదర వెంకన్న, కోమర్రాజు వెంకట్, పరికె భరత్, నక్క వెంకట్, జాన్‌సైదా, జాన్ మహమ్మద్, కరిష్మా, హస్మ, శైలజ తదితరులు ఉన్నారు.

కరాటే పోటీల్లో కోదాడ విద్యార్థుల ప్రతిభ



బహుమతులు అందుకున్న విద్యార్థులు

కోదాడ రూరల్: కోదాడ పట్టణంలోని శ్రీమన్నారాయణ కాలనీలో గల కోఫోఖాన్ కరాటే క్లబ్ విద్యార్థులు ఆదివారం వరంగల్ జిల్లా నర్సంపేటలో జరిగిన తొమ్మిదవ జాతీయ ఇన్విటేషన్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ చాటి పలు బహుమతులను గెలుచుకున్నారని కోచ్ ఆరె మాధవీలత సోమవారం తెలిపారు. తుహీనా, శాన్విత, ఆరాధ్య, తీర్థ, నాగరుద్రలు గోల్డ్ మెడల్స్, మీరా, శ్రీయాన్, సింధులు సిల్వర్ మెడల్స్ సాధించినట్లు పేర్కొన్నారు. విజేతలకు టోర్నమెంట్ చీఫ్ ఆర్గనైజర్ రచ్చ శ్రీనిబాబులు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను కోదాడకు చెందిన పలువురు అభినందించారు.

కరాటే, కుంగ్‌ఫూలో గురుకుల విద్యార్థుల సత్తా



ప్రశంసాపత్రాలు తీసుకుంటున్న నడిగూడెం గురుకుల పాఠశాల విద్యార్థులు

నడిగూడెం : హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో ఈ నెల 9న నిర్వహించిన నాలుగో జాతీయ స్థాయి ఆల్ స్టైల్స్ మార్షల్స్ కరాటే, కుంగ్‌ఫూ ఛాంపియన్‌షిప్‌లో నడిగూడెం సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. కరాటేలో అండర్– 12 విభాగంలో సీహెచ్.సోనా గోల్డ్ మెడల్, అండర్–12 విభాగంలో కుంగ్‌ఫూలో బి.చరీష్మా సిల్వర్ మెడల్, అండర్– 13వ విభాగంలో కరాటేలో డి.పవిత్ర గోల్డ్ మెడల్, అండర్–13 విభాగంలో కుంగ్‌ఫూలో టి.రోహిత సిల్వర్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక గురుకుల పాఠశాలలో విజేతలను ప్రిన్సిపాల్ చింతలపాటి వాణి, కరాటే మాస్టర్ క్రాంతికుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

‘పీఎం పరీక్ష పే చర్చ’ వీక్షించిన విద్యార్థులు



పీఎం మోదీ పరీక్ష పే చర్చ వీక్షిస్తున్న విద్యార్థులు

హుజూర్‌నగర్‌రూరల్ : పీఎం మోదీ పరీక్ష పే చర్చ కార్యక్రమం వీక్షించడం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని హెచ్‌ఎం బొల్లం వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మండలంలోని కరక్కాయలగూడెంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఎం మోదీ పరీక్ష పే చర్చ కార్యక్రమాన్ని ఎల్ఈడీ స్క్రీన్‌లో విద్యార్థులు వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రశంసాపత్రం అందజేత



ప్రశంసాపత్రం తీసుకుంటున్న భాను ప్రసాద్

నడిగూడెం : సిద్దిపేట జిల్లా కేంద్రంలో రథ సప్తమి సందర్భంగా ఈ నెల 9న వ్యాస మహర్షి యోగ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన శత సహస్ర సూర్య నమస్కారం పోటీల్లో నడిగూడెంకు చెందిన గరుడాచలం భాను ప్రసాద్ మొదటి ప్రయత్నంలోనే 852 సూర్య నమస్కారాలు చేసి ప్రతిభ కనబరిచాడు. దీంతో నిర్వాహకులు భాను ప్రసాద్‌కు మెడల్‌తో పాటు, ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భాను ప్రసాద్‌ను అతని తల్లిదండ్రులు ఆనంద్ భాస్కర్, గీత, స్థానికులు అభినందించారు.

ఓటరు జాబితా ప్రదర్శన



ఓటరు జాబితా ప్రదర్శిస్తున్న ఎంపీడీఓ, సిబ్బంది

మునగాల : త్వరలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఓటరు ముసాయిదా జాబితాను సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్ ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాపై ఏమైన అభ్యంతరాలు ఉంటే ఈనెల 13లోగా లిఖితపూర్వకంగా తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ దార శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా విడుదల

నేరేడుచర్ల : జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు సోమవారం నేరేడుచర్ల ఎంపీడీఓ కార్యాలయంలో జిల్లా సహాయ ఎన్నికల అధికారి, స్థానిక ఎంపీడీఓ సోమసుందర్‌రెడ్డి ఓటరు జాబితాను విడుదల చేశారు. ఎంపీఓ హరిసింగ్, పర్యవేక్షణ అధికారి విజయకుమారి, గ్రామ కార్యదర్శి స్వరూప, సంజయ్, సత్యనారాయణరెడ్డి, సిబ్బంది కోటి ఉన్నారు.

నియోజకవర్గ కమిటీ ఎన్నిక

హుజూర్‌నగర్ : పట్టణంలోని హోప్ పెంతుకోస్తు చర్చిలో పాస్టర్ రవికాత్ ఆధ్వర్యంలో సోమవారం పాస్టర్స్ ఫెలోషిప్ నియోజకవర్గ కమిటీ సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమిటీ నియోజకవర్గ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్లుగా తలకప్పల సుధాకర్, దయాకర్, అధ్యక్షులుగా మీసా దేవసహాయం, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా మనోజ్‌కుమార్, కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా పాలకట్ల ధర్మయ్య, ప్రధాన కార్యదర్శిగా పాతకోటి దేవదానం, సహయ కార్యదర్శిగా జాషువానాయక్, గోపి, కోశాధికారులుగా పెదపంగు ఆమోస్, సాల్మన్ రాజు, గౌరవ సలహాదారుడిగా శ్యామ్‌సుందర్‌ను ఎన్నుకున్నారు.

ఉచిత విద్య, వైద్యం అందించాలి

హుజూర్‌నగర్ : హమాలీలకు వారి కుటుంబ సభ్యులకు ఉచిత విద్య, వైద్యం అందించాలని రైస్ మిల్ హమాలీ సంఘం గౌరవ అధ్యక్షుడు మేకల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం హుజూర్‌నగర్ రైస్ మిల్ హమాలీ కార్మిక సంఘం తరఫున రైస్ మిల్ యాజమాన్యం వారికి పది డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ఇప్పుడున్న ధరలపై అదనంగా 30 శాతం ఇవ్వాలని, బోనస్, పీఎఫ్, గ్రాట్యూటీ సౌకర్యం కల్పించాలని కోరారు. సంఘం నాయకులు పి.గురవయ్య, రాజు, పటేల్, ప్రభు, చిన్న నాగేశ్వరరావు, ముఖేష్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నరసింహారావు, అప్పారావు పాల్గొన్నారు.

ఘనంగా వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు

మఠంపల్లి : మండలంలోని చౌటపల్లిలో గల శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతసేవ, మండపారాధన, నిత్యహోమం, ధ్వజారోహణం, నవగ్రహ మండపారాధన, విష్ణు సహస్రనామార్చన పారాయణం, అర్చన, అలంకరణ, నీరాజన మంత్ర పుష్పం, తీర్థప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సింగారపు సైదులుఅరుణ, ఈఓ శంభిరెడ్డి, కమిటీ సభ్యులు వీరారెడ్డి, సైదులు, మల్లేశ్వరి, శివయ్య, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా పల్లకీసేవ

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీవేణుగోపాల సీతారామచంద్రస్వామి దేవాలయంలో అధ్యయనోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం ప్రాతః కాలంలో పల్లకీ సేవ, పరమపదోత్సవం నిర్వహించారు. నమ్మాళ్వార్లకు పల్లకీ సేవ, షోడషోపచార పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన అధ్యాపకులు బదరీ నారాయణాచార్యులు, దామోదరాచార్యులు, ఈఓ గుజ్జుల కొండారెడ్డి, అధ్యాపకులు, స్థానాచార్యులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి తిరుపతమ్మ కల్యాణ మహోత్సవాలు

చిలుకూరు : మండల కేంద్రంలో శ్రీగోపయ్య సమేత లక్ష్మీతిరుపతమ్మ కల్యాణ మహోత్సవాలు మంగళవారం నుంచి మూడు రోజుల పాటు ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నారు. మంగళవారం ఉదయం మహిళలకు ముగ్గుల పోటీలు, రాత్రి 8 గంటలకు స్వామి వారి కల్యాణం జరపనున్నారు. బుధవారం ఉదయం ముగ్గుల పోటీల విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం, కోలాట ప్రదర్శన, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, సాయంత్రం స్వామి వార్ల ఊరేగింపు కార్యక్రమం, గురువారం స్వామి వార్లకు బోనాల సమర్పణ ఉంటుందని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సిరిపురంలో బ్రహ్మోత్సవాలు..

నడిగూడెం : మండలంలోని సిరిపురంలో గల రంగనాయకస్వామి ఆలయంలో మంగళవారం నుంచి గురువారం వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ తాళ్లూరి రమేష్ సోమవారం తెలిపారు. 11న అంకురార్పణ, ధ్వజారోహణం, 12న మాఘపౌర్ణమి, హోమాలతో పాటు రాత్రి స్వామివారి కల్యాణం, 13న స్వామి వారి ఊరేగింపు ఉంటుందని పేర్కొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో పూరిగుడిసె దగ్ధం

మునగాల : మండలంలోని వెంకట్రాంపురంలో నిరుపేద చింత సైదులు పూరి గుడిసె సోమవారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఇంట్లోని టీవీ, ఫ్రిజ్, కుట్టు మిషన్, ఫ్యాన్‌తో పాటు నిత్యావసర సరుకులు బట్టలు పూర్తిగా కాలి బూడిదైనట్లు బాధితుడు చింత సైదులు తెలిపారు. తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నేరేడుచర్ల : మండలంలోని దిర్శించర్ల సబ్ స్టేషన్ 33/11 కేవీలో మెయింటినెన్స్ పనులు, 11కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతులు చేపట్టనున్నందున మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు దిర్శించర్ల సబ్ స్టేషన్ కింద ఉన్న అన్ని 11 కేవీ ఫీడర్లకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఇన్‌చార్జ్ విద్యుత్ ఏఈ పందిరి శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నడిగూడెం మండలంలో..

నడిగూడెం : మండలంలోని నడిగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గల బృందావనపురం, సిరిపురం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని శ్రీరంగాపురం గ్రామాల్లో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ కె.సైదయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్నందున విద్యుత్ నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

సీతారాంరెడ్డి సేవలు మరువలేనివి

- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



సీతారాంరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి, తదితరులు

నేరేడుచర్ల : నేరేడుచర్లకు సర్పంచ్‌గా 23 ఏళ్ల పాటు సీతారాంరెడ్డి చేసిన సేవలు మరువలేనివని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. నేరేడుచర్ల మాజీ సర్పంచ్ కొణతం సీతారాంరెడ్డి ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి సోమవారం నేరేడుచర్లలో సీతారాంరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తాళ్ల సురేష్‌రెడ్డి, రామాపురం మాజీ సర్పంచ్ చింతమల్ల సైదులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మచ్చ శ్రీను, కాంగ్రెస్ నాయకులు గుంటూరు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మహాశివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష



సమీక్ష సమావేశంలో తహసీల్దార్, అధికారులు

నేరేడుచర్ల : మండలంలోని సోమారం గ్రామ పరిధిలో సోమప్ప దేవాలయంలో ఈనెల 26న జరగనున్న మహాశివరాత్రి వేడుకలను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని తహసీల్దార్ సురిగి సైదులు అన్నారు. సోమవారం నేరేడుచర్ల తహసీల్దార్ కార్యాలయంలో సోమప్ప ఆలయంలో మహాశివరాత్రి వేడుకల ఏర్పాట్లపై అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాశివరాత్రికి ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం ఎంపీఓ హరిసింగ్ మాట్లాడుతూ.. ఆలయం వద్ద 20 మంది పారిశుద్ధ్య సిబ్బందిని నియమించి పరిసరాల్లో చెత్తాచెదారం లేకుండా తరలించాలన్నారు. తదనంతరం పెంచికల్‌దిన్న ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని సౌమ్య మాట్లాడుతూ.. ఆలయం వద్ద ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయడంతో పాటు 108 వాహనాన్ని అందుబాటులో ఉంచుతామన్నారు. నేరేడుచర్ల హెడ్ కానిస్టేబుల్ మురళిచారి మాట్లాడుతూ.. ఆలయానికి వచ్చే భక్తులకు ట్రాఫిక్ సమస్య లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఎంపీడీఓ సోమసుందర్‌రెడ్డి, సోమప్ప ఆలయ కమిటీ చైర్మన్ చిత్తనూరి సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ మౌనిక, ట్రాన్స్‌కో ఏఈ పందిరి శ్రీనివాస్, దేవాదాయ శాఖ ఈఓ మృత్యుంజయ శాస్త్రి, ఆలయ ప్రధాన పూజారి ఇరువంటి శ్రీనివాసశాస్త్రి, సీనియర్ అసిస్టెంట్ చంద్రమ్మ, సోమవరం, బుర్గులతండా గ్రామాల కార్యదర్శులు రమేష్, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

కష్టాలు భరిస్తేనే సుఖాలు ప్రాప్తిస్తాయి



ప్రవచనం చెపుతున్న స్వామి సుగుణానంద గాయత్రి

మునగాల : కష్టాలు భరిస్తేనే సుఖాలు ప్రాప్తిస్తాయని శ్రీస్వామి సుగుణానంద గాయత్రి అన్నారు. మండల కేంద్రంలోని శ్రీరామలింగేశ్వర హనుమాన్ ఆలయంలో 65వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన భక్తులకు ప్రవచనాలు చెప్పారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా నందిగామకు చెందిన శ్రీనటరాజ నాట్యమండలి నిర్వహించిన నాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు, కార్యదర్శి తూముల వీరస్వామి, గంధం అంజయ్య, సభ్యులు మీసేవశర్మ, వేట సైదారావు, భక్తులు పాల్గొన్నారు.

ఆ పిల్లిపిల్లకు చక్రాలే కాళ్లు!





నడవలేని స్థితిలో ఉన్న ఓ పిల్లి పిల్లకు వైద్యం చేసి అది నడిచేలా చేసి తన ఉదారతను చాటుకున్నారు కోదాడ పశు వైద్యాధికారి డాక్టర్ పెంటయ్య. అందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. కోదాడలోని ఓ హోటల్‌లో ఉండే పిల్లి పిల్లపై ఓ బలమైన వస్తువు పడడంతో వెన్నుపూస దెబ్బతిని రెండు వెనుక కాళ్లు పనిచేయడం లేదు. ఈడ్చుకుంటూ తిరుగుతున్న పిల్లిబాధ చూడలేని ఆ హోటల్ యజమాని స్థానిక పశువైద్యశాలకు తీసుకెళ్లాడు. పరీక్షించిన పశువైద్యాధికారి పెంటయ్య పిల్లిపిల్ల వెన్నెముఖ దెబ్బతిని వెనుక కాళ్లు చచ్చుబడ్డాయని గుర్తించారు. దానికి వైద్యం చేసి వెంటనే బొమ్మల షాపులోంచి ట్రాలీ చక్రాలను తెప్పించి పొట్టకింద అమర్చి అది నడిచేలా చేశారు. రెండు రోజుల తర్వాత పిల్లిపిల్లకు శాశ్వత చక్రాల బండిని అమర్చుతానని డాక్టర్ పెంటయ్య తెలిపారు.

– కోదాడ రూరల్

ముందస్తు సాగుతోనే పొట్టదశకు పొలాలు

- కేవీకే శాస్త్రవేత్తలు శ్రీధర్, సంధ్యారాణి



కోదాడ రూరల్ : కూడిపూడిలో వరి పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు

కోదాడ రూరల్, మునగాల: ముందస్తు సాగుతోపాటు వాతావరణ మార్పుల కారణంగానే పొలాలు పొట్టదశకు వచ్చి ఈనుతున్నాయని నల్లగొండ జిల్లా త్రిపురారం మండల పరిధిలోని కేవీకే కంపాసాగర్ శాస్త్రవేత్తలు శ్రీధర్, సంధ్యారాణి అన్నారు. సోమవారం కోదాడ మండలం కూచిపూడి, రెడ్లకుంట, మునగాల మండలం తాడువాయి. వెంకట్రాంపురం గ్రామాల్లో ముందే ఈనుతున్న వరిపొలాలను కోదాడ ఏడీఏ యల్లయ్యతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ యాసంగిలో నవంబర్ 20 కంటే ముందు వరినారు సాగుచేయడం, 40 రోజుల దాటిన తర్వాత నాట్లు పెట్టుకోవడంతో పాటు వాతావరణ మార్పులతో పైరు సరిగ్గా ఎదగకుండా తల్లికర్ర ఈతకు వస్తుందన్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయాధికారుల సూచనల మేరకు ఎకరాకు 35కిలోల యూరియాను బూస్టర్ డోస్‌గా వేసుకోవాలన్నారు. తర్వాత 25 కిలోల పొటాష్ వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆయా మండలాల ఏఓలు పాలెం రజిని, బుంగా రాజు, ఏఈఓలు మహేష్, భవాని, రైతులు ఉన్నారు.

కనుల పండువగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



కల్యాణంలో తాళిబొట్టు చూపుతున్న అర్చకులు

గరిడేపల్లి : మండల కేంద్రంలోని శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని సోమవారం ఆలయ కమిటీ చైర్మన్ పెండెం శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకం చేశారు. కల్యాణంలో భాగంగా ఎదుర్కోళ్ల మహోత్సవం నిర్వహించారు. కల్యాణం అనంతరం స్వామివారి ఊరేగింపు జరిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పైడిమర్రి రంగనాథ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు త్రిపురం అంజన్‌రెడ్డి, ఓరుగంటి శ్రీనివాస్, పైడిమర్రి ప్రకాశ్, ఎడ్ల అంజన్‌రెడ్డి, ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, మేకపోతుల నాగయ్య, మేకపోతుల చంద్రయ్య, రావుల రాజీవ్, కొలిపాక కృష్ణ, బొంత అంజన్‌రెడ్డి, సొంటి కన్నయ్య, ఉరుముల నవీన్, కొండలుగౌడ్, అర్చకులు పరంకుశం, బదిరి శ్రీనివాసాచార్యులు, సుదర్శన శ్రీనివాసచార్యులు, రాజన్ ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ర్యాలీ నిర్వహిస్తున్న బాలుర పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు

కోదాడ : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని కోదాడ మండల విద్యాధికారి సలీంషరీఫ్ అన్నారు. సోమవారం ఎన్‌జీసీ కార్యక్రమంలో భాగంగా కోదాడ పట్టణంలో విద్యార్థులతో కలిసి ఆయన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్‌జీసీ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 13 పాఠశాలలను ఎంపిక చేశారని, అందులో కోదాడ బాలుర పాఠశాల కూడా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి ఎల్. దేవరాజ్, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం.మార్కండేయ, ఉపాధ్యాయులు బడుగుల సైదులు, కనకమ్మ, ముక్తార్, వీరబ్రహ్మచారి, అశోక్‌గౌడ్, రవి తదితరులు పాల్గొన్నారు.